పార్కులను సద్వినియోగం చేసుకోండి

■ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జనవరి 28: కాలనీల్లో ఏర్పాటు చేసిన పార్కులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని హుడా భారతి కాలనీలో ఉన్న పార్కును కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పంచుతాయన్నారు. ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో పార్కులను అభివృద్ధి చేశామన్నారు. కాలనీలోని పార్కులో వ్యర్థాలు పడేస్తున్నట్లు కాలనీవాసులు ఫిర్యాదు చేశారన్నారు. దాంతో పాటు రాత్రి పూట ఆకతాయిలు మకాం వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రహరి ఎత్తు తక్కువగా ఉన్నందన ఈ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రహరి సైజు పెంచడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. వాకర్స్ కోసం మట్టిని పోయించి ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానిక ఏసీపీని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


హస్తినాపురం హుడా భారతి కాలనీలో పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన శ్రీ పద్మవిభూషణ్ అవార్డుకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడికి ప్రకటించిన సందర్భంగా సెట్విన్ మాజీ డైరెక్టర్ కొప్పుల ప్రవీణ్ కుమార్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా వెంకయ్యనాయుడిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
– చాంద్రాయణగుట్ట, జనవరి28

బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నారు

కాచిగూడ, జనవరి 28: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లను కేటాయించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నింబోలి అడ్డా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 54 శాతం ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన టికెట్లు ఇవ్వకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో 120 కులాలుంటే అందులో అత్యధిక కులాలు నేటి వరకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం లభించలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూలిజాల కృష్ణ, భూషణ్‌భాస్కర్, ప్రశాంత్‌నిమ్‌కర్, ప్రదీప్‌గౌడ్, కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

సేవా రత్న పురస్కారం

అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక సేవాకర్త ఖానాపురం గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహను సేవారత్న అవార్డుతో సత్కరించింది.
– మణికొండ, జనవరి 28

తైక్వాండోలో ట్విన్స్‌కు బంగారు పతకాలు

తైక్వాండో పోటీల్లో విజయం సాధించిన కావేటి ఆరూశ్, కావేటి ఆయుక్త్‌లకు బంగారు పతకాలను అందజేస్తున్న నిర్వాహకులు

సైదాబాద్, జనవరి 28: సైదాబాద్ కాలనీకి చెందిన కావేటి ఆయుక్త్, ఆరూష్ ట్విన్స్ సోదరులు నేషనల్ తైక్వాండో పోటీలలో సత్తా చాటారు. రెండు వేర్వేరు విభాగాల్లో ఇద్దరు సోదరులు ఒకే క్రీడలో విశేష ప్రతిభ కనబర్చి ఏకంగా బంగారు పతకాలను సాధించి క్రీడాకారులకు, అభిమానులకు స్ఫూర్తిగా నిలిచారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూర్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో విఫా తైక్వాండో ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన 6వ విఫా కఫ్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్-2024 కావేటి ఆయుక్త్, ఆరూష్ బంగారు పతకాలను సాధించారు. అండర్-10 బాయ్స్ యూ 55కేజీ విభాగంలో కావేటి ఆయుక్త్ బంగారు పతకం సాధించి, ఔట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్‌ను పొందాడు. అండర్-12 బాయ్స్ యూ 60 కేజీ విభాగంలో కావేటి ఆరూష్ బంగారు పతకాన్ని సాధించి ఔట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్‌ను పొందాడు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 28: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డీఈఈ హనుమంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ శ్రావణి హాస్పిటల్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, 11 కేవీ సలీమాకతూన్ ఫీడర్ పరిధిలో ఉ.10 నుంచి మ.12 గంటల వరకు, 11 కేవీ ఖాన్ నగర్ ఫీడర్ పరిధిలో ఉ.11 నుంచి మ.1 గంట వరకు,11 కేవీ సోమనాథ్ టెంపుల్ ఫీడర్ పరిధిలో మ.2 నుంచి సా.4 గంటల వరకు, 11 కేవీ భవానీ నగర్ ఫీడర్ పరిధిలో మ.3 నుంచి సా.5 గంటల వరకు, 11కేవీ ఆస్మాన్‌ఘడ్ ఫీడర్ పరిధిలోఉ.10నుంచి మ.ఒంటి గంట వరకు, 11 కేవీ జయనగర్ ఫీడర్ పరిధిలో మ.2 నుంచి సా.5 గంటల వరకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పట్టువస్త్రాలు సమర్పణ

చాంద్రాయణగుట్ట, జనవరి 28 : పాతబస్తీ లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. యాదాద్రి దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.భాస్కర్ ఆలయ మర్యాదలతో శ్రీమహంకాళి కమిటీ సభ్యులకు స్వాగతం పలికారు. ఆలయంలో కొలువుదీరిన స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రతినిధులు జి. అరవింద్ కుమార్‌గౌడ్, కె.వెంకటేశ్, కె.విష్ణుగౌడ్, జి.కాశీనాథ్‌గౌడ్, జె.లక్ష్మీనారాయణ గౌడ్, బంగ్లారాజు యాదవ్, బి.మారుతి యాదవ్, సి.వెంకటేశ్, శీరా రాజ్‌కుమార్, సి.రాజ్‌కుమార్ యాదవ్, శేషునారాయణ, వినోద్ కుమార్, గడ్డం రవి, గడ్డం శ్రీనివాస్ లతో పాటు మాణిక్‌ప్రభుగౌడ్, శ్యామ్‌రావు ముదిరాజ్, పాత నగర జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయ ప్రతినిధులు

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ

ఉప్పుగూడ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఆదివారం తానాజీనగర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడిగా డి. కనకాచారి, గౌరవ అధ్యక్షుడిగా ఎల్. శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షులుగా కె.బాలకృష్ణాచారి, పి.దక్షిణామూర్తి, డి.లక్ష్మణాచారి, ఎన్. మహారాజ్‌చారి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌చారితో పాటు పలువురు సభ్యులను కమిటీలో స్థానం కల్పించారు. నూతన కమిటీ ఏర్పాటు అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.
– చాంద్రాయణగుట్ట, జనవరి 28

కో-ఆప్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శిగా ముజీబ్

తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ గచ్చిబౌలి మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ బోర్డు సొసైటీ కార్యదర్శిగా టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన సమావేశంలో ముజీబ్ హుస్సేనీ సొసైటీ కార్యదర్శిగా నియమితులయ్యారని సొసైటీ అధ్యక్షుడు, మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామి గౌడ్‌కు, టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, హౌసింగ్ బోర్డు డైరెక్టర్లకు ముజీబ్ హుస్సేనీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
– సుల్తాన్ బజార్, జనవరి 28

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

విద్యార్థులకు బ్లాక్‌బెల్ట్‌లు ప్రదానం చేసిన సినీ నటుడు సుమన్

● సినీ నటుడు సుమన్

చాంద్రాయణగుట్ట, జనవరి 28: ప్రతి విద్యార్థి చదువులతో పాటు క్రీడారంగంలో రాణించాలని సినీ నటుడు సుమన్ అన్నారు. ఆదివారం పాతబస్తీలో నాయక్ బుడోఖాన్ కరాటే మాస్టర్ గణేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కరాటేలో పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన విద్యార్థులకు బ్లాక్ బెల్ట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి ఆత్మ స్థైర్యంతో జీవితంలో రాణించాలన్నారు. సమాజంలో మంచి చెడ్డులను గమనిస్తూ సాధ్యమైనంత వరకు మంచి చేసే ఆలోచన చేయాలన్నారు. సామాన్య వ్యక్తి నుంచి ధనవంతుడి వరకు దేశం కోసం మంచి చేయాలనే తపన ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాస్టర్లు పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

● మాజీ ఎంపీ వి.హనుమంత్‌రావు

కాచిగూడ, జనవరి 28: సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంత్‌రావు అన్నారు. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్‌రావు అధ్యక్షతన పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువుతున్న తెలంగాణలోని మున్నూరుకాపు పేద విద్యార్థులకు ఆదివారం కాచిగూడ మున్నూరుకాపు సంఘంలో ప్రతిభా పురస్కారాలను వి.హనుమంత్‌రావు అందజేశారు. అనంతరం వీహెచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకుంటేనే బంగారు భవిష్యత్ అని, డాక్టర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే మహానీయులు సమాజానికి బంగారు బాటలు వేశారని, అది కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జల్లా కోర్టు జడ్జి శాలినీశాకెల్, ట్రస్టీలు పిల్లి శ్రీనివాస్, ఆకుల పాండురంగారావు, దడువై రాఘవేందర్, మంద సూర్యప్రకాశ్, నిమ్మ శంకర్, ఆకుల నగేశ్, వై.దేవేందర్, ఎ.చంద్రశేఖర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్ఞాన చేస్తున్న వి.హనుమంత్‌రావు, జడ్జి శాలినీశాకెల్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్, ట్రస్టీలు

బీసీలపై కుట్రపూరిత విధానాలను తిప్పికొట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఓబీసీ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు దానకర్ణాచారి

కాచిగూడ, జనవరి 28: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ, ఓబీసీలపై అవలంభిస్తున్న కుట్రపూరిత విధానాలకు వ్యతిరేకంగా బీసీలందరూ పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ ఓబీసీ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు వి. దానకర్ణాచారి పిలుపునిచ్చారు. తెలంగాణ ఓబీసీ ఉద్యోగుల సమాఖ్య సర్వసభ్య సమావేశం ఆదివారం దానకర్ణాచారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. బీసీల కులగణన చేపట్టాలని, కేంద్రం లో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. సలహాదారు విఠోభా, వి. చిన్నయ్య, జయప్రకాశ్, పాండు, రామ్మూర్తి, రామరాజుయాదవ్, రవికుమార్, రాంప్రసాద్, యాకయ్య, భాస్క ర్, నాగేశ్, గోవిందరాజులు, శ్రీశైలంగౌడ్, బాలరాజు, వంశీ, శ్రీధర్, సురేందర్, లోకేశ్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల డిమాండ్లను ప్రభుత్వంతో చర్చిస్తా

● టీపీసీసీ అధికార ప్రతినిధి రియాజ్

అంబర్‌పేట, జనవరి 28: గెస్ట్ లెక్చరర్ల డిమాండ్లను ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని టీపీసీసీ మ్యానిఫెస్టో సభ్యుడు, అధికార ప్రతినిధి రియాజ్ అన్నారు. విద్యానగర్‌లోని హిందీ మహా విద్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల గెస్ట్ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో సభ్యుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి రియాజ్, గెస్ట్ లెక్చరర్ల రాష్ట్ర అధ్యక్షుడు దామెర దామెర ప్రభాకర్, ప్రొ. జానయ్య, మాజీ టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్‌లు పాల్గొన్నారు. గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను గుర్తించి కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టినందుకు ప్రభుత్వానికి సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు సరైన విద్యను అందించే దిశగా లెక్చరర్లు పని చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించి సంవత్సరంలోని 12 నెలల సాలరీని అందించే దిశగా ప్రభుత్వం చూడాలని గెస్ట్ లెక్చరర్స్ అధ్యక్షుడు ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీపీసీసీ మ్యానిఫెస్టో సభ్యుడు, అధికార ప్రతినిధి రియాజ్

ఉప్పల్ మినీ శిల్పారామంలో నృత్యం చేసిన చిన్నారులు

అలరించిన భక్త రామదాసు రచనల నృత్యం

రామంతాపూర్, జనవరి 28: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం చిన్నారుల భక్త రామదాసు రచనల నృత్య రూపకల్పన ఆహూతులను అలరించింది. తారక మంత్రం, హరిహర రామ, తక్కువేమి మనకు, ఇదిగో భద్రాది, సీతారామస్వామి, రామదయచూడవే, చరణములే నమ్మితీ, తదితర కీర్తనలు ఎంతో అలరించాయి. ఈ కార్యక్రమంలో సుధామాల, చంద్రశేఖర్, నళినీ రమణ, వాణీ రమణ, రేణుకా ప్రభాకర్, అడపా భరణి, శ్రీలత, ఓలేటి రంగమణి, డాక్టర్ సుమిత్ర, లక్ష్మీ నారాయణ, రాజకుమార్ పాల్గొన్నారు.

■ ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

టీ ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు బట్టు దాసురావు

మలక్‌పేట, జనవరి 28: మాదిగ, మాదిగ ఉప కులాలకు ఒక డిప్యూటీ సీఎం, మరో మంత్రి పదవితో పాటు రెండు ఎంపీ సీట్లు, నామినేటెడ్ పదవులిచ్చి సముచిత స్థానాన్ని కల్పించాలని టీఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు బట్టు దాసురావు కోరారు. చివరి పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలనే డిమాండ్‌తో నేడు(సోమవారం) సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు దాసురావు పేర్కొన్నారు. ఈ సమావేశానికి మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు, మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు ముసారం బాగ్‌లోని ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చివరి పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి మోడీపై ఒత్తిడి తేవాలన్నారు. కమిటీల పేరుతో బీజేపీ కాలాయాపన చేస్తున్నదని, ఎన్నికలకు ముందు కొత్త కుట్రలకు తెరతీస్తూ వర్గీకరణ బిల్లు నీరుగారి పోయేలా చేస్తున్నదని ఆయన ఆరోపించారు.

■ పేదల సేవే లక్ష్యంగా 'రెడీ టూ సర్వ్'

నిలోఫర్ ఆసుపత్రి వద్ద అన్నదానం చేస్తున్న పెద్ది శంకర్ తదితరులు

ఆర్కేపురం, జనవరి 28: పేదల ఆకలి తీర్చేందుకు రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ముందుకెళ్తున్నదని ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెద్ది శంకర్ అన్నారు. నిలోఫర్, ఎం.ఎన్.జె. కాన్సర్ ఆసుపత్రి వద్ద రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే రోగులకు సహాయకులుగా వచ్చే వారు చాలా ఇబ్బందుల్లో ఉండి ఒక్క పూట భోజనం చేయాలంటే సుమారు రూ.200 ఖర్చవుతుందని, అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అన్నదానం చేస్తున్నామని చెప్పారు. పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల సేవే లక్ష్యంగా తమ ఫౌండేషన్ ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో కైరం కొండా ధనుంజయ, ప్రకాశ్ యాదవ్, శివచైతన్య, శివనేత, నితిన్, విష్ణువర్ధన్, చిన్న, వేణు, దేవ, మణి, ఆనంద్, సత్యసాయి పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

హమీదుల్లానగర్ గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, తదితరులు

శంషాబాద్ రూరల్, జనవరి 28: అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తెలిపారు. ఆదివారం మండలంలోని హమీదుల్లానగర్ గ్రామంలో రూ. 7,30 లక్షలతో బీసీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్విరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కే చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ వట్టెల సతీష్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ దవణాకర్‌గౌడ్,ఉప సర్పంచ్ మాధవియాదగిరి, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

శంషాబాద్ రూరల్ పీఎస్ ఆవరణలో నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనాథ్

శంషాబాద్ రూరల్, జనవరి 28: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ రూరల్ సీఐ శ్రీనాథ్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పెద్దషాపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద గతంలో వివిధ కేసులలో నిందితులుగా ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనాథ్ మాట్లాడుతూ.... మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వివిధ కేసులలో నిందితులుగా ఉన్న వారు ప్రవర్తన మార్చుకొని మరోసారి నేరాలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్‌తో పాటు పలువురు పోలీసులు ఉన్నారు.

బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు అపహరణ

వెంగళరావునగర్, జనవరి 28:ఆర్టీసీ కండక్టర్ బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.50 వేలు చోరీకి గురయ్యాయి. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం..జవహర్‌నగర్‌లో నివాసం ఉండే ఆర్టీసీ కండక్టర్ సీ.హెచ్. సాయిప్రసాద్(37)కు చెందిన ఎస్బీఐ అకౌంట్ నుంచి రూ.50 వేలు తమిళనాడు రాష్ట్రంలోని గంగిరాంప్టి ఏటీఎం నుంచి పలు విడుతలుగా డ్రా అయ్యాయి. తన అకౌంట్‌లో నుంచి నగదు తనకు తెలియకుండా డ్రా చేయడంతో బాధితుడు సాయిప్రసాద్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్కడి వ్యర్థాలు అక్కడే..

నగరంలోని రోడ్లు, వీధుల్లో, పారిశుధ్య నిర్వహణ చెత్త సేకరణ లక్ష్యం నీరుగారుతున్నది. పలుచోట్ల ఎక్కడి వ్యర్థాలు అక్కడే పేరుకుపోతున్నాయి. బేగంబజార్‌లోని చుడీబజార్‌లో రోడ్డుపై చెత్త పేరుకుపోయింది. దీంతో దుర్వాంధం వెదజల్లుతుందని, ఇండ్లలో ఉండలేక పోతున్నామని ఆదివారం స్థానికులు ఆరోపించారు. ఫిర్యాదు చేసినప్పటికీ పారిశుధ్య సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.
– సుల్తాన్‌బజార్, జనవరి 28